గుట్టుగా కేటాయింపు

- ముడా భూ కుంభకోణంలో కొత్త కోణం
- చర్చ జరపకుండానే స్థలాల అప్పగింత
- ఆడియో టేపులు విడుదల చేసిన బీజేపీ

బెంగళూరు, ఆగస్టు 31: కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా భూ కేటాయింపు కుంభకోణంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. తన భార్య పార్వతికి స్థలాల కేటాయింపు 2020లో బీజేపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని ఇంతకాలం సిద్ధరామయ్య చెప్తూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే 2020లో స్థలాల కేటాయింపు కోసం జరిగిన ముడా సమావేశంలో పార్వతికి స్థలాల కేటాయింపు విషయం చర్చకే రాలేదని బీజేపీ ఎమ్మెల్సీ రవి కుమార్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మీటింగ్ మినిట్స్‌ను, సమావేశానికి సంబంధించిన ఆడియో రికార్డింగులను ఆయన విడుదల చేశారు. పార్వతికి స్థలాల కేటాయింపు గురించి ఆడియోలో, మీటింగ్ మినిట్స్‌లో ఎక్కడా లేదని, అసలు నిర్ణయమే తీసుకోలేదని రవికుమార్ ఆరోపించారు. కాగా, ముడాలో కీలకంగా పని చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వారికి సిద్ధరామయ్య సర్కారు పదోన్నతులు కల్పిస్తున్నదని బీజేపీ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స పేర్కొన్నారు. ముడా కమిషనర్‌గా పని చేసిన జీటీ దినేశ్ కుమార్‌ను హవేరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఎందుకు నియమించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ముడాకు సంబంధించిన ఫైళ్లను మంత్రి బైరాతి సురేశ్ తీసుకెళ్లి, నాశనం చేశారని ఆయన ఆరోపించారు.

స్కామ్‌పై విచారణ.. కాంగ్రెస్ నిరసన

ముడా స్కామ్‌లో తనపై విచారణకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ రాజ్‌భవన్ ముందు కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య ఆందోళనకు దిగారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్ధరామయ్యతో పాటు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజ్ భవన్ ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు సిద్ధరామయ్య ఆరోపించారు.

సిద్ధరామయ్యను టచ్ చేయదా?

పార్టీలో సంక్షోభం తలెత్తుతుందనే సీఎం మార్పుకు కాంగ్రెస్ వెనుకంజ

ముడా స్థలాల కేటాయింపు, ఖర్గే ట్రస్టు భూ కేటాయింపు, వాల్మీకి బోర్డు నిధుల దారి మళ్లింపు వంటి కుంభకోణాలతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ట మసకబారింది. స్వయంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముడా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఆయనపై త్వరలో విచారణ కూడా ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పీఠం నుంచి దించేస్తారనే ప్రచారం కర్ణాటక కాంగ్రెస్‌లో జోరుగా సాగింది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం ఈ ధైర్యం చేసే అవకాశాలు లేవని విశ్లేషకులు భావిస్తున్నారు. సిద్ధరామయ్యను తప్పిస్తే ముఖ్యమంత్రి పదవి కోసం ఏర్పడే పోటీతో పార్టీలో సంక్షోభం తలెత్తుతుందనే ఆందోళన హైకమాండ్‌లో ఉందంటున్నారు. డీకే శివకుమార్ వర్గం, సిద్ధరామయ్య వర్గం మధ్య ఆధిపత్య పోరు తీవ్రమవుతుందని చెప్తున్నారు. పైగా అహింద(మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, దళితులు) వర్గాలు దూరమవుతాయనే ఆలోచనతోనూ హైకమాండ్ ఉందంటున్నారు. కర్ణాటకలో నాయకులకు కాంగ్రెస్ అవసరం లేదని, కాంగ్రెస్‌కే నాయకుల అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

జార్కిహోళితో పరమేశ్వర మంతనాలు

ముడా, వాల్మీకి, ఖర్గే ట్రస్టు కుంభకోణాల నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వరుసగా చుట్టుముడుతున్న ఆరోపణలతో సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకుంటారనే ప్రచారం నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి కోసం మంతనాలు మొదలయ్యాయి. ఒకవైపు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పదవి కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు హోంమంత్రి పరమేశ్వర శుక్రవారం మంత్రి సతీశ్ జార్కిహోళి ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి దిగిపోవాల్సి వస్తే పరమేశ్వరను సీఎం చేయాలనే డిమాండ్‌ను అధిష్ఠానం ముందుంచాలని సతీశ్ జార్కిహోళి సహా సిద్ధరామయ్య వర్గీయులు భావిస్తున్నారు. ఈ దిశగానే ఈ సమావేశంలో చర్చలు జరిగినట్టు సమాచారం.

శంభు సరిహద్దు వద్ద వినేశ్ ఫోగాట్‌ను సన్మానిస్తున్న రైతులు

మీ అమ్మాయి.. మీతోనే

రైతుల ఆందోళనకు వినేశ్ ఫోగాట్ మద్దతు

శంభు వద్ద 200 రోజులకు చేరిన కర్షకుల పోరాటం

న్యూఢిల్లీ: ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ శనివారం హర్యానాలోని శంభు సరిహద్దుల్లో రైతుల నిరసనలో పాల్గొన్నారు. రైతులకు సంఘీభావం తెలుపుతూ.. ''మీ అమ్మాయి మీతోనే'' ఉంటుందని వారి పోరాటానికి మద్దతు పలికారు. పంటలకు కనీస మద్దతు ధర తదితర డిమాండ్లతో పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతులు చేస్తున్న నిరసన 200వ రోజుకు చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వినేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎంతో కాలం నుంచి సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నప్పటికీ రైతుల శక్తి సామర్థ్యాలు తగ్గలేదని ప్రశంసించారు. రైతు కుటుంబంలో జన్మించడం తనకు గర్వకారణమని చెప్పారు. మన హక్కుల కోసం మనమే పోరాడాలని, మన కోసం ఇతరులు ఎవరూ రారని అన్నారు. హక్కులను తీసుకోకుండా వెనుకకు వెళ్లకూడదన్నారు. రైతుల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం నేత సర్వణ్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ, తమ శాంతియుత నిరసన తీవ్రత చాలా ఎక్కువగా ఉందని తెలిపారు. తమ ధర్నాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రానున్న హర్యానా శాసన సభ ఎన్నికల కోసం తాము ఓ వ్యూహాన్ని రచిస్తామని ఈ నేతలు సంకేతాలు ఇచ్చారు. రాష్ట్ర రాజకీయ యవనికపై చురుకైన పాత్ర పోషించే ఉద్దేశాన్ని కనబరిచారు.

వరద సహాయక చర్యల్లో అలసత్వం

గుజరాత్‌లో ఫినాయిల్ తాగి యువకుడి నిరసన

జామ్‌నగర్, ఆగస్టు 31: భారీ వరదలు సంభవిస్తున్న గుజరాత్‌లో సహాయక చర్యల్లో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీంతో ఒక యువకుడు ఫినాయిల్ తాగి తన నిరసన వ్యక్తం చేశాడు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా జామ్‌నగర్‌లోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. తమకు తాత్కాలిక వసతి, ఆహారం అందించాలని బాధితులు వేడుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ముంపు ప్రాంతాలను సందర్శించడానికి ఉన్నతాధికారులు వచ్చినప్పుడు విపుల్ అనే యువకుడు అదే విషయంపై అధికారులను నిలదీస్తూ నిరసనగా ఫినాయిల్‌ను తాగాడు. అప్రమత్తమైన అధికారులు వెంటనే అతడిని దవాఖానకు తరలించి చికిత్స అందించారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు ఇళ్లపైకి చేరి సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారిని ఎన్డీఆర్ఎఫ్, భారత వైమానిక దళం, తీర గస్తీ దళాల సాయంతో రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పతంజలి పళ్ల పొడిలో చేపల అవశేషాలు

బాబా రాందేవ్, కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ మరోమారు చిక్కుల్లో పడ్డారు. పతంజలి ఆయుర్వేద సంస్థ ఉత్పత్తి చేసే ఆయుర్వేద పళ్ల పొడి 'దివ్య మంజన్'లో మాంసాహార అనవాళ్లు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు బాబా రాందేవ్, పతంజలి సంస్థకు, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. దివ్య మంజన్‌ను మొక్కల ఆధారిత ఆయుర్వేద ఉత్పత్తిగా ప్రచారం చేస్తుండడంతో తాను చాలాకాలంగా ఆ పొడర్‌ను ఉపయోగిస్తున్నట్టు పిటిషనర్ అయిన అడ్వకేట్ యతిన్‌శర్మ తెలిపారు. అయితే, ఇందులో చేపల నుంచి తీసే 'సుమద్రఫేన్' (సేపియా అఫిసినాలిస్)ను ఉపయోగించినట్టు తాజా పరిశోధనలో వెల్లడైందని పేర్కొన్నారు. తమది పూర్తిగా శాకాహార కుటుంబమని ఈ విషయం తెలిశాక తనతోపాటు కుటుంబం కూడా తీవ్ర మనస్తాపానికి గురైందని పేర్కొన్నారు. కోర్టు విచారణను నవంబర్ 28కి వాయిదా వేసింది.

156 ఎఫ్‌డీసీ డ్రగ్స్ నిషేధంపై స్టే

న్యూఢిల్లీ : దేశంలోని పలు ఔషధ కంపెనీలకు ఊరట లభించింది. 156 ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్స్ (ఎఫ్‌డీసీ) మందులపై నిషేధం విధిస్తూ కేంద్రం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వు జారీ చేసింది. రెండు లేదా అంతకంటే ఎక్కువ క్రియాశీల ఔషధ పదార్థాలతో తయారైన ఒకే రూపంలోని ఔషధాన్ని ఎఫ్‌డీసీ డ్రగ్ అంటారు. ఎఫ్‌డీసీలతో తయారైన ఔషధాల అమ్మకం, పంపిణీ తక్షణం నిలిపేయాలంటూ కేంద్రం జారీ చేసిన ఆదేశాలపై మ్యాన్‌కైండ్ ఫార్మా, ఇండోకో రెమిడీస్, లీఫోర్డ్ హెల్త్ కేర్, నవిల్ ల్యాబరేటరీస్ తదితర కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. కేంద్రం ఉత్తర్వులను నిలిపివేసిన న్యాయస్థానం నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. కేసును డిసెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.

అమెరికాలో నేపాల్ యువతిపై కాల్పులు

నిందితుడు భారత సంతతి పౌరుడు

వాషింగ్టన్, ఆగస్టు 31: అమెరికాలో దొంగతనం చేసేందుకు ఫ్లాట్‌లో చొరబడ్డ దుండగుడు..ఓ యువతిపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నేపాల్‌కు చెందిన విద్యార్థిని మునా పాండే (21) ప్రాణాలు కోల్పోయిందని, నిందితుడు బాబీ సిన్హ్షా (52) భారత సంతతి పౌరుడని పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు బాబీ సిన్హ్షాను నిందితుడిగా పేర్కొంటూ ఫొటోను విడుదల చేశారు. అతడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. కాల్పుల ఘటన గత సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో జరిగినట్టు తెలిపారు. 2021లో నేపాల్ నుంచి అమెరికాకు వచ్చిన మునా పాండే, హూస్టన్‌లోని కమ్యూనిటీ కాలేజ్‌లో చదువుకుంటున్నది. రక్తం మడుగులో పడివున్న ఆమె మృతదేహం పోలీసులకు లభ్యమైనది.

వక్ఫ్ బిల్లుపై జేపీసీలో మాటల యుద్ధం

న్యూఢిల్లీ: వక్ఫ్ బోర్డ్ అధికారాలకు కోత పెడుతూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు'పై శుక్రవారం నాటి 'సంయుక్త పార్లమెంటరీ కమిటీ' (జేపీసీ) సమావేశం వాడివేడిగా సాగింది. బీజేపీ, విపక్ష ఎంపీల మధ్య మాటల యుద్ధం సాగింది. ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు కొంతసేపు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. 'వక్ఫ్ బై యూజర్' నిబంధన తొలగింపుపై విపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని తొలగిస్తే ఉత్తరప్రదేశ్‌లో లక్షలుపైగా వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యే అవకాశముందని అన్నారు. మరోవైపు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, బీజేపీ సభ్యుడు దిలీప్ సైకియా మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. జేపీసీ కమిటీ సెప్టెంబర్ 5-6న మళ్లీ సమావేశం కానున్నది.

పల్స్ పోలియో ఉండగా ఇజ్రాయెల్ దాడి

గాజాలో 48 మంది మృతి

గాజా: ఒక వైపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి సన్నాహాలు జరుగుతుండగా ఇజ్రాయెల్ దళాలు శనివారం గాజా స్ట్రిప్‌పై దాడి చేశాయి. ఈ ఘటనలో 48 మంది మృతి చెందారు. 25 ఏండ్ల తర్వాత టైప్-2 పోలియో వైరస్ లక్షణాలు ఒక బాలుడిలో కన్పించడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 6.40 లక్షల మందికి పోలియో టీకాలు వేయాలని నిర్ణయించింది. తాత్కాలిక కాల్పుల విరమణలకు ఇజ్రాయెల్ దళాలు, హమాస్ అంగీకరించాయి. శనివారం 2 వేల మంది వైద్య సిబ్బంది వివిధ ప్రాంతాల్లో వ్యాక్సినేషన్‌కు సన్నాహాలు ప్రారంభించారు. ఇంతలో, ఇజ్రాయెల్ దాడులు చేయడంతో 48 మంది మరణించారని తెలిసింది.

హర్యానా అసెంబ్లీ ఎన్నికలు అక్టోబర్ 5కు మార్పు

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ ఏడాది అక్టోబర్ 1న కాకుండా అదే నెల 5న ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. అక్టోబర్ 2న బిష్ణోయ్ సామాజిక వర్గ శతాబ్దాల నాటి పండుగను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తేదీని మార్చినట్టు తెలిపింది. దీంతో గతంలో ప్రకటించిన విధంగా జమ్ము-కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఓట్ల లెక్కింపు అక్టోబర్ 4న కాకుండా అక్టోబర్ 8న జరుపుతామని ఈసీ వెల్లడించింది. అఖిల భారత బిష్ణోయ్ మహాసభ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఎన్నికల తేదీని మార్చినట్టు ఈసీ తెలిపింది.

లావోస్‌లో సైబర్ బానిసలుగా మారొద్దు!

47 మందిని రక్షించిన భారత ఎంబసీ అధికారులు

న్యూఢిల్లీ, ఆగస్టు 31: లావోస్‌లో 'నకిలీ ఉద్యోగ అవకాశాల' పట్ల అప్రమత్తంగా ఉండాలని అక్కడి భారత ఎంబసీ అధికారులు మనదేశ పౌరులను హెచ్చరిస్తున్నారు. బోకియో ప్రావిన్స్‌లో 47 మంది భారతీయుల్ని కాపాడి, స్వదేశానికి పంపామని ఎంబసీ అధికారులు శనివారం ప్రకటించారు. ఇప్పటివరకు 635 మంది భారతీయుల్ని రక్షించినట్టు చెప్పారు. ఫేక్ జాబ్ ఆఫర్లను నమ్మి, లావోస్ వస్తున్న అనేకమంది భారతీయులు సైబర్ బానిసలుగా పనిచేయాల్సి వస్తున్నది. రోజువారీ టార్గెట్‌ను చేరుకోకపోతే వారు ఆహారం, విశ్రాంతి కోల్పోవాల్సి వస్తున్నది.

'హత్యాచారంపై సందీప్ ఘోష్‌ది ఒకటే మాట'

కోల్‌కతా: ఆర్‌జీ కర్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ ఒకే మాట మీద ఉన్నారు. 18 రోజుల్లో మొదట కోల్‌కతా పోలీసులు, ఆ తర్వాత సీబీఐ అధికారులు ప్రశ్నించినా; రెండుసార్లు పాలిగ్రాఫ్ టెస్ట్‌లు చేసినా ఆయన ఒకే విషయాన్ని చెప్తున్నారు. పీజీటీ డాక్టర్ మరణించినట్లు తనకు ఆగస్టు 9న ఉదయం సుమారు 10.20 గంటల ప్రాంతంలో తెలిసిందని చెప్పారు. మరోవైపు ఈ కేసులో దర్యాప్తు అధికారులు ఘోష్‌కు తెలిసిన వ్యక్తులు కొందరు ఘటన జరిగిన రోజు దవాఖానలో ఎందుకున్నారు? వీరికి ఎవరు సమాచారం ఇచ్చా రు? డాక్టర్ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని కాలర్‌కు ఎవరు చెప్పారు? హాస్పిటల్‌కు పోలీసులు వెళ్లినపుడు ఘోష్ అక్క డ ఎందుకు లేరు? అనే అంశాలను సీబీఐ అధికారులు పరిశీలిస్తున్నారు. ఘోష్ కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు.

సారీ అమ్మ.. నిన్ను చంపేశా

తల్లి శవంతో ఇన్‌స్టాలో కొడుకు సెల్ఫీ పోస్ట్

రాజ్‌కోట్, ఆగస్టు 31: మానసిక పరిస్థితి సరిగ్గా లేని తల్లిని కోపంలో చంపేసిన 21 ఏండ్ల కుమారుడు 'సారీ అమ్మ నిన్ను చంపేశా' అంటూ తల్లి శవంతో ఇన్‌స్టాలో ఫొటో పెట్టిన ఘటన గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో చోటుచేసుకుంది. యూనివర్సిటీ రోడ్‌లోని భగత్‌సింగ్‌జీ గార్డెన్‌లో నీలేశ్ గోసాయ్ అనే యువకుడు తల్లి జ్యోతిబెన్ గోసాయ్ (48) తో కలిసి నివసిస్తున్నాడు. ఏదో విషయమై తల్లితో గొడవపడిన నీలేశ్ ఆమెపై కత్తితో దాడి చేశాడు. దానిని ఆమె అడ్డుకోవడంతో దుప్పటితో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. తర్వాత ఆమె మృతదేహం పక్కన కూర్చుని సెల్ఫీ తీసుకుని 'సారీ అమ్మ.. నిన్ను చంపేశా.. నిన్ను మిస్ అవుతున్నాను..నా జీవితాన్ని కోల్పోయాను.. ఓం శాంతి' అని ఇన్‌స్టాలో పోస్టులు పెట్టాడు. స్థానికుడొకరు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు నేరాన్ని అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు.

కారవాన్లలో రహస్య కెమెరాలు

నటీమణుల వీడియోలు చూస్తుంటే హెచ్చరించా

మాలీవుడ్‌పై బాంబు పేల్చిన ప్రముఖ నటి రాధిక

తిరువనంతపురం: మలయాళీ సినీ పరిశ్రమ మాలీవుడ్‌పై ప్రముఖ నటి రాధిక శరత్‌కుమార్ బాంబు పేల్చారు. ఓ మలయాళం సినిమా చిత్రీకరణ సమయంలో నటీమణుల కారవాన్‌లో రహస్య కెమెరాలను పెట్టారని, వాటి ద్వారా చిత్రీకరించిన అభ్యంతరకరమైన వీడియోలను నటులు తమ మొబైల్ ఫోన్లలో చూస్తుండటాన్ని తాను గమనించానని చెప్పారు. ఈ సంఘటనతో తనకు చాలా కోపం వచ్చిందని, కారవాన్ ఇన్‌ఛార్జిని పిలిచి, మళ్లీ ఇలాంటి సంఘటన జరిగితే తీవ్రమైన చర్య తీసుకుంటానని హెచ్చరించానని చెప్పారు. ఓ మలయాళీ టీవీ చానల్‌తో మాట్లాడుతూ రాధిక చేసిన ఈ ఆరోపణలతో అందరూ ఉలిక్కిపడ్డారు. జస్టిస్ హేమ కమిటీ నివేదికపై సినీ పరిశ్రమల్లోని పురుష నటులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. రాధిక ఆరోపణలపై ఆర్ఎంపీ నేత, ఎమ్మెల్యే కేకే రెమ స్పందిస్తూ సినీ పరిశ్రమ అతి పెద్ద అండర్ వరల్డ్‌గా మారుతోందన్నారు. రాధిక ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

పరిశ్రమను నాశనం చేయొద్దు: మోహన్‌లాల్

మలయాళం సినీ కళాకారుల సంఘం అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన నటుడు మోహన్‌లాల్ శనివారం మాట్లాడుతూ, అందరూ మొత్తం దృష్టిని తమ సంఘంపైనే పెట్టవద్దని కోరారు. దర్యాప్తు జరుగుతున్నదని, పరిశ్రమను నాశనం చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

'హేమ కమిటీ నివేదిక వివరాలివ్వండి'

మలయాళం సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల గురించి బయటపెట్టిన జస్టిస్ హేమ కమిటీ నివేదికను పూర్తిగా తమకు ఇవ్వాలని జాతీయ మహిళా కమిషన్ కేరళ ప్రభుత్వాన్ని కోరింది. ఈ నివేదికలోని కొన్ని వివరాలు మాత్రమే బహిరంగంగా అందుబాటులో ఉన్నాయని తెలిపింది.

చోరీ జరగకున్నా తాళ్లతో కట్టేసి ఊరేగింపు

గుజరాత్‌లో అమానవీయ ఘటన

గాంధీనగర్: విత్తనాలు కొని డబ్బులు చెల్లించడం మరిచిపోయిన వ్యక్తి పట్ల దుకాణ యజమాని అమానవీయంగా ప్రవర్తించాడు. శుక్రవారం గుజరాత్‌లోని గోద్రాలో జరిగిన ఈ ఘటనలో దుకాణం యజమాని, మరో ఇద్దర్ని అరెస్టు చేసిన పోలీసులు, బాధితుడిపైనా కేసు నమోదు చేయటం గమనార్హం. కిశోర్ బాఫ్రి అనే వ్యక్తి కాకర విత్తనాలు కొని డబ్బులు చెల్లించటం మర్చిపోయాడు. దుకాణ యజమాని పార్మర్ అడిగిన వెంటనే రూ.500 చెల్లించాడు. అయినా, కోపంతో ఊగిపోయిన పార్మర్ మరో ఇద్దరిని పోగేసి కిశోర్‌ని తాళ్లతో కారు బ్యానెట్‌పై కట్టేసి, రోడ్లపై తిప్పాడు.

జిల్లా న్యాయవ్యవస్థ సబార్డినేట్ కాదు!

జ్యుడిషియరీకి వెన్నెముక వంటిది: సీజేఐ

సుప్రీం కోర్టు స్టాంప్‌ను ఆవిష్కరిస్తున్న సీజేఐ చంద్రచూడ్, ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: జిల్లా న్యాయవ్యవస్థ ఎప్పటికీ సబార్డినేట్ కాదని, మొత్తం న్యాయ వ్యవస్థకు వెన్నెముక వంటిదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రజలు న్యాయం కోసం మొదటగా జిల్లా న్యాయ వ్యవస్థనే ఆశ్రయిస్తారని, అది చట్ట పాలనలో ఒక కీలకమైన భాగమని, అటువంటి దాన్ని సబార్డినేట్ అని పిలవడం ఆపాలని అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థను సబార్డినేట్‌గా పిలిచే బ్రిటీష్ కాలం నాటి సంప్రదాయాన్ని వదిలేయాలని సూచించారు. సుప్రీంకోర్టును ఏర్పాటు చేసి 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా శనివారం సుప్రీంకోర్ట్ ఆవరణలో 'జిల్లా న్యాయ వ్యవస్థపై జాతీయ సదస్సు'ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీజేఐతో పాటు ప్రధాని మోదీ, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వజ్రోత్సవాల స్టాంప్, నాణెన్ని మోదీ ఆవిష్కరించారు.

మహిళలపై నేరాల్లో తీర్పులు వేగంగా రావాలి: మోదీ

మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో తీర్పులు వేగంగా రావాలని ప్రధాని మోదీ అన్నారు. మహిళల భద్రతకు భరోసా కోసం ఇది అవసరమని చెప్పారు. మహిళలపై దురాగతాలు, బాలల భద్రత సమాజానికి తీవ్ర ఆందోళనకరమైన అంశాలని తెలిపారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో ఓ వైద్యురాలిపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేయడంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు సుప్రీంకోర్టు, దేశ న్యాయ వ్యవస్థపై అపార నమ్మకం ఉందన్నారు.

తరలిస్తుండగా కూలిన హెలికాప్టర్

న్యూఢిల్లీ, ఆగస్టు 31: ఐఏఎఫ్‌కు చెందిన ఎంఐ-17 చాపర్ ద్వారా కేదార్‌నాథ్ నుంచి గౌచర్‌కు తరలిస్తున్న సాంకేతికపర లోపాలున్న ఓ ప్రైవేటు హెలికాప్టర్ కూలిపోయింది. లించోలీలోని మందాకిని నది సమీపంలో శనివారం ఈ హెలికాప్టర్ కూలిందని, ఈ ఘటనలో ఎవరూ చనిపోలేదని, ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. మరమ్మతు కోసం హెలికాప్టర్‌ను గౌచర్ ఎయిర్‌స్ట్రిప్‌కు తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకొన్నదని రుద్రప్రయాగ్ జిల్లా పర్యాటక శాఖ అధికారి రాహుల్ చౌబే తెలిపారు. ఈ హెలికాప్టర్‌ను తీసుకెళ్తున్న క్రమంలో ప్రారంభ సమయంలోనే బరువు, గాలి కారణంగా ఎంఐ-17 హెలికాప్టర్ బ్యాలెన్స్ తప్పిందని, దీంతో పైలట్ ఆ చాపర్‌ను ఒక ఖాళీ ప్రాంతంలో వదిలేశాడని వివరించారు. కూలిన హెలికాప్టర్‌లో ప్రయాణికులు ఎవరూ లేరని, కూలిన తర్వాత ఘటనాస్థలికి రెస్క్యూ సిబ్బంది వెళ్లారని తెలిపారు. యాత్రికులను కేదార్‌నాథ్ ఆలయం వద్దకు తీసుకెళ్లే ఈ ప్రైవేటు హెలికాప్టర్ సాంకేతిక లోపాలతో మే నెలలో కేదార్‌నాథ్ సమీపంలో అత్యవసర ల్యాండింగ్ చేసింది.

రోజుకు 30 నిమిషాలే నిద్ర!

- 12 ఏండ్లుగా ఇదే అలవాటు
- ఆశ్చర్యపరుస్తున్న జపాన్ వ్యక్తి

టోక్యో, ఆగస్టు 31: ఆరోగ్యకర జీవితం కోసం రోజూ రాత్రిపూట కనీసం 8 గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తుంటారు. కానీ, దీనికి భిన్నంగా జపాన్‌లో 40 ఏండ్ల వైసుకే హోరీ అనే వ్యక్తి గత 12 ఏండ్ల నుంచి విచిత్రమైన సాధన చేస్తున్నాడు. ఇంతకీ ఆయన చేస్తున్నదేమిటంటే.. రోజుకు 30 నిమిషాలు మాత్రమే నిద్రపోతున్నాడు. వారానికి 16 గంటలు జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. దీని వల్ల తాను ఎన్నడూ అలసటకు గురి కాలేదని హోరీ చెప్తున్నాడు. తినడానికి గంట ముందు కాఫీ తాగడం, ఆటలు ఆడటం ద్వారా మగతను నిరోధించవచ్చని తెలిపాడు.

కల్పనా చావ్లాలా కాకూడదనే..

- ఆలస్యమైనా సునీతా విలియమ్స్‌ను సురక్షితంగా తీసుకువస్తాం
- మిషన్‌లో తప్పులు జరిగాయని నాసా చీఫ్ నెల్సన్ అంగీకారం

న్యూఢిల్లీ, ఆగస్టు 31: గతంలో ఏర్పడిన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకునే నాసా వ్యోమగాములైన ఇండో అమెరికన్ సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్‌మోర్‌లను ఎనిమిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలోనే ఉంచాల్సి వస్తున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. 2003లో భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా, మరో ఆరుగురు స్పేస్‌షిప్ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. 1986లో కూడా స్పేస్ షటిల్ ఛాలెంజర్ పేలిపోవడంతో 14 మంది వ్యోమగాములు మరణించారు. ఈ రెండు ఘటనలు పునరావృతం కాకూడదనే ఆలస్యమైనప్పటికీ విలియమ్స్, మరొకరిని సురక్షితంగా వెనక్కి రప్పించాలని అంతరిక్ష కేంద్రంలోనే ఉంచేశారు. 'ఈ రెండు ప్రమాదాలు మాపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. అందుకే ఐఎస్